సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 4 । జనవరి । 2024



వైద్యం వికటించి వృద్ధుడు మృతి
వైద్యుడి వైద్యం వికటించడం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. - 8లో



ఆరు గ్యారంటీలు అందిస్తాం
ప్రజాపాలన గ్రామ సభలు బుధవారం కొనసాగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. - 9లో



ప్రింటెడ్ ఇక్కత్‌ను అరికట్టాలి
ప్రింటెడ్ ఇక్కత్ వస్త్రాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కోరారు. - 10లో

న్యూస్‌రీల్


కలెక్టర్‌ను కలిసిన భువనగిరి కౌన్సిలర్లు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ కౌన్సిలర్లు బుధవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేను కలిశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఈనెల 27వ తేదీన అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ 31మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

'ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి'

భువనగిరి టౌన్ : భువనగిరిలోని బిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థినికి ఫోన్‌లో అసభ్యకర మెసేజ్‌లు పెట్టి, లైంగిక వేధింపులకు గురి చేసిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేయాలని ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొదారి వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తనతో చాటింగ్ చేయాలని, ప్రేమించాలని మెసేజ్‌లు పంపుతూ పరీక్షల్లో ఎక్కువ మార్కులు రాకుండా చేస్తానని బెదిరించడం అమానుషం అన్నారు. టెన్త్ విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్ లేకుండా స్టడీ అవర్స్ నిర్వహించడం, పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుడు గతంలో పని చేసిన పాఠశాలల్లోనూ విద్యార్థులను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



నూతన భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ రవికుమార్

అడ్డగూడూరు : అడిషనల్ డీసీపీ రవికుమార్ బుధవారం అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణం కోసం చొల్లరామరం శివారులో వలిగొండ- తొర్రూర్ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఆయన వెంట రామన్నపేట సీఐ మోతీరామ్, ఎస్ఐ నాగరాజు ఉన్నారు.

9,10 తేదీల్లో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

చౌటుప్పల్ : పట్టణంలో ఈనెల 9,10 తేదీల్లో సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. బుధవారం చౌటుప్పల్‌లోని పార్టీ కార్యాలయంలో శిక్షణ తరగతుల కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై శిక్షణ తరగతుల్లో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పాలకులు ప్రజల ఆలోచనల మేరకు పాలన సాగించాలని, నియంతృత్వ ధోరణి బలపడితే ఎలా ఉంటుందో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండీ పాష, అవ్వారు రామేశ్వరి, బండారు నర్సింహ, గంగదేవి సైదులు, తడక మోహన్, రాగీరు కిష్టయ్య, సంజీవ రెడ్డి, గోపగోని లక్ష్మణ్, పల్లె మధుకృష్ణ, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

భువనగిరి : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలని డీఈఓ నారాయణరెడ్డి కోరారు. బుధవారం భువనగిరిలోని బీచ్‌మహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు రేపాక ఉమా, ప్రధాన కార్యదర్శి కోమిరెల్లి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గవ్వ జ్యోతి,రాష్ట్ర క్రీడా కో కన్వీనర్ కొత్తకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వాసాలమర్రి గోస!

ప్రశ్నార్థకంగా గ్రామ పునర్నిర్మాణం



శిథిలావస్థలో ఉన్న ఇళ్లు

- మూడేళ్ల క్రితం దత్తత తీసుకున్న అప్పటి సీఎం కేసీఆర్
- సర్వేలు, ప్రతిపాదనలతోనే సరి
- ప్రభుత్వం మారడంతో అభివృద్ధిపై నీలినీడలు
- ఆందోళనలో గ్రామస్తులు
- నూతన ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

సాక్షి యాదాద్రి : మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రి అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. బంగారు వాసాలమర్రిగా మారుస్తానన్న కేసీఆర్ వాగ్దానం కార్యరూపం దాల్చలేదు. మూడేళ్లుగా సర్వేలు, ప్రతిపాదనలు చేసినా ఏదీ జరగలేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో గ్రామస్తులు ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దత్తత తీసుకోవాలని కోరుతున్నారు.

2020 నవంబర్1న దత్తత

తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిని అప్పటి సీఎం కేసీఆర్ 2020 నవంబర్1న దత్తత తీసుకున్నారు. రూ.150 కోట్లకు పైగా ప్రభుత్వ నిధులతో బంగారు వాసాలమర్రిగా మారుస్తానని గ్రామసభలో ప్రకటించారు. కలెక్టర్ అధ్యక్షతన గ్రామ అభివృద్ధి కమిటీని నియమించారు. ఏడాదిలోగా అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రకటించారు. అయితే దత్తత తీసుకున్న 10 నెలల దాకా వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదు. ఆ తర్వాత గ్రామాన్ని నూతన లేఅవుట్ ప్రకారం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వకపోవడంతో గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్న దృశ్యం

కలెక్టర్ బదిలీతో నిలిచిన పనులు

వాసాలమర్రిని కేసీఆర్ దత్తత తీసుకొని మూడేళ్లు గడిచినా పనుల్లో కదలిక రాలేదు. అప్పటి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గత సెప్టెంబర్‌లో లేఅవుట్ ప్రకారం ఇళ్ల పునర్నిర్మాణం కోసం టెండర్లు పిలుస్తామని ప్రకటించారు. ఈలోపు ఆయన బదిలీ కావడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. ఇళ్లను కూలగొట్టుకుంటే తమవి చెట్టుకింద బతుకులయ్యేవని గ్రామస్తులు సాక్షితో చెప్పారు. నూతన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5 లక్షలు మంజూరు చేస్తే ఇళ్లు నిర్మించుకుంటామని గ్రామస్తులు కోరుతున్నారు.

పాత ఇళ్లు కూల్చి కొత్తవి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు యువతకు ఉపాధి కల్పిస్తామని, ప్రతి ఇంటికి పాడి గేదె, అవసరమైన వారికి ట్రాక్టర్లు అందజేస్తామని, జాబితాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు రూ.150 కోట్లతో ఒకసారి, రూ.165 కోట్లతో మరోసారి డీపీఆర్ రూపొందించి సీఎం పేషీకి పంపించారు. ఆర్కిటెక్ట్‌లు ప్లాన్ రూపొందించి మార్కింగ్ చేశారు. తదనంతరం గ్రామంలో సొంతంగా ఇళ్ల నిర్మాణానికి పంచాయతీ అనుమతులు నిలిపివేసింది.

రూ.58.57 కోట్లు కేటాయింపు

గ్రామ అభివృద్ధికోసం గత ఏడాది ఏప్రిల్ 18న జారీ చేసిన 159 జీఓ ప్రకారం రూ. 58.57 కోట్లు కేటాయించారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున 481 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.24.24 కోట్లు మంజూరయ్యాయి.పంచాయతీ భవనానికి రూ.20లక్షలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల భవన నిర్మాణానికి రూ.3.23 కోట్లు, రూ.75 లక్షలతో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.25 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మించాలని నిర్ణయించారు. రోడ్లు, పార్కులు, ఫంక్షన్ హాల్ సహా మౌలిక వసతుల కోసం రూ.30.14 కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారు.

అభివృద్ధి జరగలేదు



కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వాసాల మర్రి అభివృద్ధికి కొన్ని నిధులు కేటాయించారు. అవి పక్కకు పోకుండా చూడాలి. 200 గజాల స్థలం ఇస్తామని చెప్పడంతో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ,, పాఠశాల తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదు. డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేవు. సమస్యలతో సతమతమవుతున్నాం.

–మధు, వాసాలమర్రి

కొత్త సీఎం పట్టించుకోవాలి



ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఉన్న సీఎం కేవలం యాదగిరిగుట్ట నుంచి ఆయన ఫాం హౌజ్ వరకు మాత్రమే రోడ్డు వేశారు. మిగతా పనులన్నీ అలాగే వదిలిపెట్టారు. గతంలో రోడ్డు వేసేటప్పుడు రెండు ఇళ్లు తొలగించి పరిహారం కూడా ఇవ్వలేదు. కొత్త సీఎం పట్టించుకోవాలి.

–లింగయ్య, వాసాలమర్రి

గ్రామం పూర్తిగా నష్టపోయింది



అప్పటి సీఎం కేసీఆర్ మా గ్రామాన్ని దత్తత తీసుకొని బంగారువాసాలమర్రిగా మారుస్తానంటే సంతోషపడ్డాం. అప్పుడు విడుదల చేసిన రూ.55 కోట్లతో చేపట్టిన పనులు జరుగుతున్నాయి.రూ.45 కోట్ల మేర పనులకు బడ్జెట్ రావాల్సి ఉంది. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు నిలిచిపోయాయి. సీడీఎఫ్ నిధులు కూడా వాడుకోలేకపోయాం. ప్రభుత్వం మారడంతో పునరాలోచనలో పడ్డాం.100 కుటుంబాలకు పైగా తమ ఇళ్లపై కవర్లు కప్పుకొని జీవనం సాగిస్తున్నాయి. ఎమ్మెల్యే, మంత్రి, సీఎం గ్రామంలో పర్యటించి ప్రజల పరిస్థితిని చూడాలి. అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనలు, సభలు, సమావేశాల కోసం నేను వ్యక్తిగతం రూ.25లక్షలు ఖర్చు చేశాను. అయినా ప్రయోజనం లేకుండాపోయింది.

–పోగుల ఆంజనేయులు, సర్పంచ్, వాసాలమర్రి

• సావిత్రీబాయి ఫూలేకు నివాళి



సావిత్రీబాయి ఫూలే జయంతి సందర్భంగా బుధవారం మోటకొండూరులోని బాలికల గురుకుల విద్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు

'ఆపరేషన్ స్మైల్'ను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

సాక్షి, యాదాద్రి : ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ అధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆపరేషన్ స్మైల్‌పై సమీక్షించారు. ఆపరేషన్ స్మైల్ ఇప్పటికే ప్రారంభం అయినందున పోలీసు, విద్య, వైద్య, కార్మిక, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, స్వచ్ఛంద సంస్థలు, బాలల సంక్షేమ సమితి అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న, నిరాధరణకు గురవుతున్న బాలలను గుర్తించడంతో పాటు చిన్నారుల అక్రమ రవాణాపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. నిరాధరణకు గురవుతున్న బాలలకు పునరావాసం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆపరేషన్ స్మైల్ కోసం భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట డివిజన్‌లలో మూడు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ, నలుగురు కానిస్టేబుల్స్, ఒక లేబర్ ఆఫీసర్, బాలల పరిరక్షణ అధికారి, చైల్డ్ లైన్ అధికారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధితో కూడిన బృందాలు పని చేస్తున్నాయని చెప్పారు. బాలల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అందుకోసం క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గుర్తించిన చిన్నారులకు రక్షణ, సంరక్షణ, పునరావాసం కల్పించాలని, పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ బండారు జయశ్రీ, ఏసీపీ వెంకట్‌రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి అన్నపూర్ణ, సభ్యులు శివరాజ్, మల్లేశ్, ఇస్తారి, బాల రక్ష భవన్ కోఆర్డినేటరు చందనేశ్వరి, బాలల పరిరక్షణ అధికారి సైదులు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ దశరథ, ఎన్‌జీఓ శివలింగం, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు మొయినుద్దీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కూరెళ్ల గ్రంథాలయం స్ఫూర్తిదాయకం



అదనపు కలెక్టర్ వీరారెడ్డిని సన్మానిస్తున్న కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామంలో గల ఆచార్య కూరెళ్ల గ్రంథాలయాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి బుధవారం సందర్శించారు. గ్రంథాలయంలోని పుస్తకాలు, వసతులు, నిర్వహణ తీరును పరిశీలించారు. సొంత ఇంటిని గ్రంథాలయంగా మలచి రెండు లక్షలకు పైగా పుస్తకాలతో, పింఛన్ డబ్బుతో గ్రంథాలయం నిర్వహించడం స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయం వ్యవస్థాపకుడు డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను అదనపు కలెక్టర్ సన్మానించారు. అదే విధంగా మొదటిసారి గ్రంథాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌ను కూరెళ్ల సన్మానించారు. ఆయన వెంట ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీఓ అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, గ్రంథపాలకుడు తాటిపాముల స్వామి తదితరులు ఉన్నారు.

'ఐఎస్ఐ'పై అవగాహన అవసరం

- బీఐఎస్ రాష్ట్ర డైరెక్టర్ కేవీ రావు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న బీఐఎస్ డైరెక్టర్ కేవీరావు

భువనగిరి రూరల్ : ఐఎస్ఐ మార్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బీఐఎస్ రాష్ట్ర డైరెక్టర్ కేవీ రావు సూచించారు. భువనగిరి మండలంలోని మండలం అనంతారంలోని బీసీ గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఐఎస్ఐ మార్క్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేష్ తన్నీరు, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయితో కలిసి కేవీఆర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తువుల నాణ్యత ప్రామాణికతను తనిఖీ చేయడానికి ఐఎస్ఐ మార్కు దోహదపడుతుందన్నారు. బంగారం యొక్క స్వచ్ఛతకు హాల్ మార్క్, వ్యవసాయ వస్తువుల నాణ్యతకు అగ్రిమార్కు, ఎలక్ట్రానిక్ వస్తువుల నాణ్యతను ఎస్ మార్కు ద్వారా తెలుసుకోవచ్చన్నారు. మార్కెట్‌లో ఐఎస్ఐ మార్కు లేని వస్తువులు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టాండర్డ్ రైటింగ్, పోస్టర్‌మేకింగ్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యపూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం చేపట్టారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు.

12నుంచి సంక్రాంతి సంబురాలు

- జిట్టా బాలకృష్ణారెడ్డి



సంక్రాంతి సంబురాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి తదితరులు

భువనగిరి : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈనెల 12నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి సంబురాలను జయప్రదం చేయాలని యువజన సంఘాల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జిట్టా బాలకృష్ణారెడ్డి కోరారు. బుధవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్రాంతి సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సంక్రాంతి సంబురాల్లో భాగంగా జిల్లా, గ్రామీణ స్థాయి క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా యువత డ్రగ్స్, ఇతర చెడుమార్గాల్లో పయనించి ఏ విధంగా నష్టపోతుందో సందేశాన్ని ఇచ్చే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిట్టా రాధమ్మ ఫౌండేషన్ సహకారంతో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యువత పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సమితి నాయకులు బద్దం భాస్కర్‌రెడ్డి,బెల్లి చంద్రశేఖర్, దాసరి శ్రీనివాస్,సరగడ కరణ్,హమీద్, చింతల లక్ష్మీనారాయణ, రత్నపురం శ్రీనివాస్, శంకర్, మోహన్ తదతరులు పాల్గొన్నారు.

ఎనిమిది నర్సింగ్ కళాశాలలు

- 100 పడకల ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు కానున్న కళాశాలలు
- ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు
- మెరుగుపడనున్న వైద్యసేవలు



వంద పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటున్న చౌటుప్పల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

చౌటుప్పల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత త్వరలోనే తీరనుంది. 100 పడకల ఆస్పత్రులకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఎనిమిది కళాశాలలు రానున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. కళాశాలలు అందుబాటులోకి వస్తే ఆస్పత్రుల్లో సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

ఈ ప్రాంతాల్లో ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో ఎనిమిది ప్రాంతాల్లో నర్సింగ్ కళాశాలలు అందుబాటులోకి రానున్నాయి. నల్లగొండ జిల్లాలో దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నకిరేకల్, సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, యాదాద్రి భువనగిరిలో చౌటుప్పల్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో కాలేజీలో 50 సీట్లు రానున్నాయి. నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని వెల్లడించిన నేపథ్యంలో ఇప్పటికే నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే కళాశాలలను 100 పడకల ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేస్తారా, ప్రత్యేకంగా నూతన భవనాలు నిర్మిస్తారా అన్నది స్పష్టత రావల్సి ఉంది.

తీరనున్న నర్సుల కొరత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత తీవ్రంగా ఉంది. రోజువారీగా వచ్చే రోగుల సంఖ్యకు అనుగుణంగా నర్సులు లేకపోవడంతో వైద్యసేవలు సరిగా అందడం లేదు. రాష్ట్రంలో ఏటా వేల మంది విద్యార్థులు బయటకు వస్తున్నా స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలు, విదేశాలకు వెళ్తున్నారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్–2012 ప్రకారంగా ప్రతి 100 పడకలకు 45 మంది నర్సులు ఉండాల్సి. కానీ,అందులో సగం కూడా లేరు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు నూతన నర్సింగ్ కళాశాలలు అందుబాటులోకి వస్తే నర్సుల కొరత తీరనుంది. క్షేత్రస్థాయిలో పర్యటించి పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్ సెంటర్లలో రోగులకు వైద్యసేవలు అందించనున్నారు.

స్థానిక యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

స్థానికంగా నర్సింగ్ విద్య అందుబాటులో లేదు. నర్సింగ్ కోర్సు చదవాలంటే దూర ప్రాంతాలకు వెళ్లవలసి ఉంది. దీంతో చాలా మంది విద్యార్థులు నర్సింగ్ కోర్సు చదవాలని ఉన్నా తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నారు. ప్రత్యామ్నాయంగా స్థానికంగా అందుబాటులో ఉన్న ఒకేషనల్ కోర్సులపై దృష్టిసారిస్తున్నారు.కొందరు చదువుకు స్వస్తి చెబుతున్నారు. 100 పడకల ఆస్పత్రులకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రోగులకు నాణ్యమైన సేవలు



ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్‌గా తప్పిస్తే ప్రభుత్వ పరంగా నర్సింగ్ కళాశాలలు లేవు. నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తే ఒకేషనల్ కోర్సులు చదివే వేలాదిమంది విద్యార్థులు నర్సింగ్ విద్య వైపు వస్తారు. తద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత తీరనుంది. రోగులకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. క్షేత్రస్థాయి పర్యటనటల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సైతం మంచి సేవలు అందుతాయి.

–చింతకింది కాటంరాజు, మండల వైద్యాధికారి, చౌటుప్పల్

చౌటుప్పల్‌లో కొనసాగుతున్న 100 పడకల ఆస్పత్రి నిర్మాణం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత సంవత్సరం చౌటుప్పల్ పట్టణంలో చేపట్టిన 100పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సుమారు రూ.36 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే పనులు మొదలయ్యాయి.

స్థానికంగానే విద్య, ఉపాధి



చౌటుప్పల్ ప్రాంతం నుంచి వందలమంది ఇతర ప్రాంతాలకు వెళ్లి నర్సింగ్ కోర్సు చదువుతున్నారు. వంద పడకల ఆస్పత్రులకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. కళాశాలలు అందుబాటులోకి వస్తే నర్సింగ్ చదివే విద్యార్థులకు స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రధానంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత తీరనుంది.

–కె.అలివేలు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, చౌటుప్పల్

సీఎం నిర్ణయం హర్షణీయం



100 పడకల ఆసుపత్రి ఉన్న చోట దానికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో మంచిది. వైద్య సేవలను మరింతగా గ్రామాలకు విస్తరించవచ్చు. సిబ్బంది కొరత తీరుతుంది. రోగులకు మరిన్ని మెరుగైన సేవలు లభిస్తాయి. వచ్చే విద్యాసంవత్సరంలోనే తరగతులు ప్రారంభం అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–తాదూరి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ, చౌటుప్పల్

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


మందుల శంకర్

చందూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన మందుల శంకర్ మంగళవారం భార్యతో గొడవపడి ఇంట్లోనే తన సెల్ ఫోన్‌ను వదిలేసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో శంకర్ భార్య ఉషారాణి బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చండూరు ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. శంకర్ ఆచూకీ తెలిసిన వారు 8712670182 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

వృద్ధురాలు దారుణ హత్య

- కొట్టి చంపిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఇంట్లో ఒంటరిగానే ఉంటున్న మృతురాలు


మంచంపై విగతజీవిగా పడి ఉన్న లీలమ్మ

నేరేడుచర్ల: గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామ పంచాయతీ పరిధిలోని తెలగరామయ్యగూడెంలో బుధవారం జరిగింది. నేరేడుచర్ల ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలగరామయ్యగూడేనికి చెందిన సోమ లీలమ్మ(80) భర్త చనిపోవడంతో ఆమె ఇంట్లో ఒంటరిగానే ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి కూడా లీలమ్మ ఇంట్లో ఒంటరిగానే నిద్రించింది. అయితే బుధవారం ఉదయం లీలమ్మ ఎంతకీ బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై ఆమె విగతజీవిగా కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. లీలమ్మ మొహంపై గాయాలు, రక్తపు మరకలు ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను పదునైన ఆయుధంతో కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతురాలి కుమారుడు సోమ గాని సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం

- లోకోపైలెట్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

నల్లగొండ క్రైం: మద్యం మత్తులో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేయగా.. లోకోపైలెట్ అప్రమత్తతో అతడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన బుధవారం నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేసే రాజు మద్యం మత్తులో బుధవారం నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. అదే సమయంలో గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు ట్రైన్ నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఆగిన తర్వాత నెమ్మదిగా ముందుకు కదిలింది. రైలులోని లోకోపైలెట్‌కు పట్టాలపై పడుకున్న రాజు కనిపించడంతో కిందికి దిగి అతడిని దూరంగా తీసుకెళ్లాడు. ఆ తర్వాత రైలును ముందుకు కదిలిస్తుండగా.. రాజు మళ్లీ వచ్చి పట్టాలపై పడుకున్నాడు. ఇలా 3 సార్లు చేయడంతో సమీపంలోని వారు వచ్చి రాజును దూరంగా తీసుకెళ్లారు. కాగా కుటుంబ తగాదాలతో మద్యం మత్తులో రాజు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు అక్కడికి వచ్చిన వారు చర్చించుకోవడం గమనార్హం.

నల్లగొండ కలెక్టర్‌గా హరిచందన

- 20 రోజుల క్రితం హెల్త్ డైరెక్టర్‌గా బదిలీ అయిన ఆర్‌వి.కర్ణన్
- ఇప్పటి వరకు ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరించిన హేమంత్ కేశవ్ పాటిల్
- నూతన కలెక్టర్‌ను నియమించి పాటిల్‌ను రిలీవ్ చేసిన ప్రభుత్వం
- పర్యావరణ పరిరక్షణలో హరిచందనకు దేశంలోనే గుర్తింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరి నియమితులయ్యారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన ఆర్‌వి.కర్ణన్‌ను 20 రోజుల క్రితం ప్రభుత్వం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అప్పటి నుంచి పూర్తి అదనపు బాధ్యతలను అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు అప్పగించింది. ప్రస్తుతం నల్లగొండ జిల్లాకు కలెక్టర్‌గా 2010 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హరిచందనను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇన్‌చార్జి బాధ్యతల నుంచి హేమంత్ కేశవ్ పాటిల్‌ను రిలీవ్ చేసింది. ఇప్పటివరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా ఉన్న హరిచందన గురువారం లేదా శుక్రవారం నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.



తండ్రి బాటలో సివిల్స్ వైపు..

హరిచందన తండ్రి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హైదరాబాద్‌కు చెందిన దాసరి శ్రీనివాసులు. ఆమె విద్యాభ్యాసం ఉమ్మడి రాష్ట్రంలోని హైదరాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, పాడేరు, కాకినాడలో సాగింది. పదో తరగతి ప్రకాశం జిల్లాలో చదివారు. ఇంటర్ హైదరాబాద్ సెయింట్ ఆన్స్ కాలేజీలో చదవిన ఆమె.. డిగ్రీ (బీఏ ఎకనామిక్స్) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారు. ఆ తరువాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనావిక్స్‌లో పర్యావరణ అర్థశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశాక కార్బన్ క్రెడిట్స్‌పైన పరిశోధన చేశారు. ఆ తరువాత ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలోని సంస్థలో రూ.కోటి వార్షిక వేతనంతో ఉద్యోగం చేసిన హరిచందన.. ప్రజలకు సేవలు అందించాలన్న లక్ష్యంతో తండ్రి బాటలోనే సివిల్స్ వైపు మళ్లారు. ఆ ఉద్యోగాన్ని వదిలేసి స్వదేశానికి వచ్చారు. మొదట సివిల్స్ రాసినప్పుడు ఐఆర్‌ఎస్ సాధించిన ఆమె 2009లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ పూర్తయ్యాక 2010లో విశాఖపట్నం అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఆ తరువాత విజయవాడ సబ్ కలెక్టర్‌గా, హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా, ఆయుష్ డైరెక్టర్‌గా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు.

దేశవ్యాప్తంగా పేరుప్రతిష్టలు

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్నప్పుడు పర్యావరణ పరిరక్షణపై మక్కువతో ఆమె అందించిన సేవలకు దేశంలోనే ప్రతిభావంతులైన పది మంది ఐఏఎస్ అధికారుల్లో ఒకరుగా ఆమె గుర్తింపు పొందారు. తడిచెత్త, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయించడం, చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేయడం, వ్యర్థాలను ఎరువుగా మార్చడం, పంచతంత్ర పార్కుల అభివృద్ధి వంటి వినూత్న కార్యక్రమాలకు ఆమె శ్రీకారం చుట్టారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం సక్సెస్ అయింది. దీంతో ఆమెకు పేరు ప్రఖ్యాతులు వచ్చారు. అలాగే దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్‌లో వెదురుతో సమావేశ మందిరాన్ని నిర్మించారు. గచ్చిబౌలిలో ప్రత్యేకమైన డాగ్ పార్కును ఏర్పాటు చేశారు. జీరో వేస్ట్ కార్యాలయం, షీ టాయిలెట్స్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చారు. ఆమె భర్త ఐఆర్‌ఎస్ అధికారి కాగా.. వీరికి ఒక కూతురు ఉంది.



- **పెట్రోల్ బంక్‌లు ఖాళీ..**

ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె చేస్తున్నారని తెలియడంతో మంగళవారం పెద్ద ఎత్తున వాహనదారులు పెట్రోల్ బంక్‌ల వద్దకు చేరి పెట్రోల్, డీజిల్ పోయించుకున్నారు. దీంతో రాత్రి వరకు బంక్‌లన్నీ ఖాళీ అయ్యాయి. కొందరు బుధవారం బంక్‌ల వద్దకు వెళ్లేసరికి నోస్టాక్ బోర్డు కనిపించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– భువనగిరిటౌన్

వైన్ షాపులో దొంగతనం

- రూ.4,21,000 నగదు, మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లిన దుండగులు


దొంగతనం జరిగిన వైన్ షాపు పరిసరాలను పరిశీలిస్తున్న క్లూస్ టీం

రాజాపేట: గుర్తుతెలియని వ్యక్తులు వైన్ షాపులో చొరబడి నగదు, మద్యం ఎత్తుకెళ్లారు. ఈ ఘటన రాజాపేట మండలంలోని పొట్టిమర్రి గ్రామ పరిధిలో జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టిమర్రి గ్రామ పరిధిలో మాధవరెడ్డి అనే వ్యక్తి అరుణాచల వైన్ షాపును నిర్వహిస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి 10 గంటలకు రోజుమాదిరిగానే వైన్ షాపునకు తాళాలు వేసి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్తులు వైన్ షాపులో దొంగలు పడినట్లు గుర్తించి మాధవరెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే షాపు వద్దకు చేరుకున్న మాధవరెడ్డి చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. దీంతో ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ సురేందర్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి క్లూస్ టీంను రప్పించి పరిసరాలను పరిశీలించారు. రూ.4,21,000 నగదుతో పాటు సుమారు మద్యం బాటిళ్లు చోరీకి గురైనట్లు వైన్ షాపు నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి వృద్ధుడు మృతి

- ప్రైవేట్ క్లినిక్ ఎదుట బంధువుల ఆందోళన


వెంకటయ్య మృతదేహం

నకిరేకల్: అనారోగ్యంతో ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించుకున్న వ్యక్తి మృతిచెందాడు. అయితే ఆర్‌ఎంపీ వైద్యుడు చేసిన వైద్యం వికటించే సదరు వ్యక్తి చనిపోయాడని అతడి బంధువుల ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం నకిరేకల్ పట్టణంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని 18వ వార్డు ముత్యాలమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న బొంత వెంకటయ్య (60)కు భార్య, కుమారుడు ఉన్నారు. వెంకటయ్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వెంకటయ్యకు జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ క్లినిక్‌లో చికిత్స కోసం వెళ్లాడు. ఆ క్లినిక్‌లో పనిచేసే ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకటయ్యకు ఇంజెక్షన్, మాత్రలు ఇచ్చి పంపాడు. అయితే చికిత్స చేసిన ఆర్‌ఎంపీ వైద్యుడే సాయంత్రం వెంకటయ్య ఇంటికి వెళ్లి తాను ఇచ్చిన మాత్రలను తిరిగి తెచ్చాడు. బుధవారం వెంకటయ్య తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడు చేసిన వైద్యం వికటించే వెంకటయ్య మృతిచెందాడని ఆగ్రహించిన అతడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సదరు ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎస్‌ఐలు సుధీర్‌కుమార్, గోపికృష్ణ అక్కడకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి, మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని ఇంకా ఫిర్యాదు మాకు అందలేదని ఎస్‌ఐలు తెలిపారు


ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

జాతీయ స్థాయిలోనూ రాణించాలి


గణేశ్‌ను అభినందిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాలని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని రాంనగర్‌కు చెందిన ఐతరాజు గణేష్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే (అండర్-19, 70కేజీల విభాగం) పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. బుధవారం డీఎస్పీ వెంకటగిరి తన కార్యాలయంలో గణేశ్ అభినందించి మాట్లాడారు. యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం కోచ్ శ్రీధర్‌ను కూడా అభినందించారు.

ఇష్టారీతిన చెరువు మట్టి తవ్వకం

- గుంతలుగా మారుతున్న చెరువు
- చేపల పెంపకానికి ఇబ్బంది అవుతుందని మత్స్య సొసైటీ సభ్యుల ఆవేదన


ట్రాక్టర్లలో చెరువులోని మట్టిని తరలిస్తున్న రైతులు

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్‌లో గల చెరువులో నీరు ఇంకిపోవడంతో స్థానిక రైతులు చెరువులోని సారవంతమైన మట్టిని పంట పొలాలకు తోలుకుంటున్నారు. మట్టిని తవ్వే జేసీబీ యంత్రాల నిర్వాహకులు ట్రాక్టర్ ట్రిప్పుకు రైతుల వద్ద నుంచి కిరాయి తీసుకుంటూ ఎక్కువ సంఖ్యలో ట్రిప్పులు పడాలనే దురాలోచనతో ఒకేచోట గుంతలు పెడుతూ మట్టిని తవ్వుతున్నారని. చెరువులో జేసీబీతో ఇష్టారీతిన లోతుగా గుంతలు తవ్వి తరలిస్తున్నారని, దీంతో భవిష్యత్‌లో చేపలు పెంచాలన్నా, వాటిని పట్టాలన్నా ఇబ్బందులు ఎదురవుతాయని మత్స్య సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని వారు గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన రెవెన్యూ అధికారులకు తెలిపారని అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. మట్టి తవ్వకాలపై కొందరు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి చేరుకుని తవ్వకాలను నిలిపివేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై నీటిపారుదల శాఖ డివిజనల్ ఏఈ సతీష్‌ను వివరణ కోరగా చెరువు మట్టి ఇష్టారీతిన తవ్వుతున్నారనే సమాచారం అందిందని, సిబ్బందిని పంపి తవ్వకాలను నిలిపివేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వితే రైతులైనా సరే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని, అనుమతులు తీసుకొని తాము సూచించిన పద్ధతిలో మాత్రమే తవ్వకాలు జరపాలన్నారు.

కేంద్ర పథకాలు బూత్ స్థాయిలో చేరాలి


నకిరేకల్ : మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

నకిరేకల్ : పార్లమెంట్ ఎన్నికలు త్వరలో రాబోతున్నందున ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో కేంద్ర పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని భువనగిరి మాజీ ఎంపీ, పీఎం విశ్వకర్మ యోజన తెలంగాణ కన్వీనర్ బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నేతలు బంధారపు లింగస్వామి, నకిరేకంటి మొగిలయ్య, ఐతగోని అనిత, పట్టణ, మండల అధ్యక్షులు పల్స శ్రీనివాస్‌గౌడ్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్వాయి భాస్కర్, పబ్బు వెంకన్న, పొట్లపల్లి నర్సింహ, తాటిపాముల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల ధర్నా


ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నల్లగొండటౌన్: నూతన పెన్షన్స్ కింద కవర్ అవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కాంట్రిబ్యూషన్‌ను 10 నుంచి 14 శాతానికి పెంచాలని ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ బ్రాంచ్ కార్యదర్శి వేముల శ్రీనివాస్ కోరారు. బుధవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. 2022 ఆగస్టు 1వ తేదీ నుంచి చేపట్టాల్సిన వేతన సవరణ కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అన్ని కేడర్లలో తగిన నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీలు కరుణాకర్ రావు, జి.శేఖర్, ఉశయ్య, రమేష్, గోపి, యాదగిరి, రమేష్, దీప్లా నాయక్, అరుణమ్మ, శ్రీకాంత్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

మోదీని గద్దె దించడమే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టూటౌన్ : పార్లమెంట్ ఎన్నికల వేళ అయోధ్యలో రామ మందిరాన్ని తెరపైకి తీసుకొచ్చిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఇండియా కూటమి లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న బీజేపీని గద్దె దించేందుకే ఇండియా కూటమి ఏర్పడిందన్నారు. మోదీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను అమలు చేస్తూ.. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ బడా బాబులకు అప్పజెప్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ అహంకారంతోనే బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు. అనంతరం ఇటీవల మరణించిన తెలంగాణ సాయుధపోరాట యోధుడు లింగారెడ్డికి సమావేశంలో సంతాపం తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, నారి ఐలయ్య, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాశం, లక్ష్మీనారాయణ, కున్‌రెడ్డి నాగిరెడ్డి, కట్ట నరసింహ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి, పాల్గొన్న సీపీఎం నాయకులు

భూ ఆక్రమణలను వెలికి తీయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారు సర్వేనంబర్లు 126, 110 ,160 లలో గల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని, ఈభూమిని వెలికి తీసి పేదలకు పంచాలని సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివ కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. సర్వేనంబర్ 126 లో సుమారు 85 ఎకరాలలో ఉన్న ప్రభుత్వ భూమి మొత్తం బీఆర్‌ఎస్ నాయకులు, కొంతమంది స్థానిక నాయకులు కలిసి కబ్జా చేశారని ఆరోపించారు . ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, రాంజీ, సయ్యద్‌హుస్సేన్, కరుణాకర్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్‌గా ఇమ్మడి సతీష్



కోదాడఅర్బన్ : వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్‌గా కోదాడకు చెందిన ఎస్‌ఆర్‌ఐ ఇమ్మడి సతీష్‌బాబు నియమితులయ్యారు. బుధవారం కోదాడలో నిర్వహించిన కార్యక్రమంలో సతీష్‌కు క్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్ రాచర్ల కమలాకర్ నియామకపత్రం అందజేశారు. కాగా, వాసవీ క్లబ్ కోదాడ అధ్యక్షుడిగా 2023 సంవత్సరంలో సతీష్ చేసిన విశేష కృషికి, కోదాడ క్లబ్‌ను అంతర్జాతీయ పటంలో నిలిపేవిధంగా చేసిన సేవలకు ఈ పదవి లభించింది. సతీష్‌ను వాసవీ క్లబ్ నాయకులు చల్లా విజయశేఖర్, శ్రీనివాసరావు అభినందించారు.

లింగగిరి ఉపాధ్యాయురాలికి సావిత్రిబాయి ఫూలే అవార్డు


జాజుల శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు జ్యోతి

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండల పరిధిలోని లింగగిరి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఇందిరాల జ్యోతికి రాష్ట్ర స్థాయిలో సావిత్రిబాయి పూలే అవార్డు వరించింది. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేతులు మీదుగా ఈ అవార్డును ఆమె అందుకున్నారు. జ్యోతికి అవార్డు రావడం పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ పెండ్యం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, ధనలక్ష్మి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నర్సరీలో మొక్కల పెంపకం సరిగా లేదు

పెన్‌పహాడ్: నర్సరీల్లో మొక్కల పెంపకం సరిగా లేదని కలెక్టర్ వెంకట్రావు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం పెన్‌పహాడ్ మండలం మాచారంలోని నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీలో మొక్కల పెంపకం సరిగా లేదని బ్యాగుల్లో వేసిన విత్తనాలు సరిగా మొలకెత్తలేదని, పర్యవేక్షణ సరిగా లేదన్నారు. గుల్మోహర్, గానుగ, మారేడు మొక్కలను కలెక్టర్ పరిశీలించారు. లక్ష్యం 7,500 మొక్కలు కాగా ఇచ్చిన లక్ష్యాన్ని కూడా సరిగా చేయకపోవడానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంత మంది ఉండి కూడా మొక్కలు సరిగా లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ సువర్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, ఏకస్వామి ఉన్నారు.

ఈ-కేవైసీ కోసం బారులు


చౌటుప్పల్‌లోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద బారులుదీరిన వినియోగదారులు

చౌటుప్పల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకునేందుకు మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలకు వస్తున్నారు. ఉదయం పూట కార్యాలయాలు తెరుచుకోకముందే వినియోగదారులు ఆయా ఆఫీసుల వద్దకు చేరుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో వస్తున్న జనం కార్యాలయాల ప్రధాన ద్వారం వద్ద క్యూలైన్‌లో నిల్చుంటున్నారు. బుధవారం చౌటుప్పల పట్టణ కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్దకు వందలాది మంది వినియోగదారులు వచ్చి క్యూలో నిల్చున్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా లైన్ కట్టారు. గంటల తరబడి క్యూలోనే నిల్చొని ఈ-కేవైసీ చేయించుకున్నారు.

విద్యార్థినికి అసభ్య మెసేజ్‌లు పంపిన టీచర్

- దేహశుద్ధి చేసిన విద్యార్థిని కుటుంబ సభ్యులు
- ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు


నిందితుడు సంజయ్

భువనగిరి క్రైం: పదో తరగతి విద్యార్థినికి ఉపాధ్యాయుడు అసభ్య మెసేజ్‌లు పంపి వేధించాడు. విషయం తెలుసుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన బుధవారం భువనగిరి పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే బెల్లి సంజయ్ పట్టణంలో పలు పాఠశాలల్లో పీరియడ్ వారీగా సైన్స్ సబ్జెక్ట్ బోధిస్తుంటాడు. కొందరు విద్యార్థులు సబ్జెక్ట్‌లో తమ అనుమానాల నివృత్తి కోసం పలుమార్లు సంజయ్‌ను సెల్‌ఫోన్‌లో సంప్రదించేవారు. ఇదే అదనుగా భావించిన సంజయ్ ఓ విద్యార్థిని సెల్ ఫోన్‌కు అసభ్య మెసేజ్‌లు పంపడం ప్రారంభించాడు. సోషల్ మీడియా యాప్ అయిన ఇన్‌స్టాగామ్ లోనూ ఆ విద్యార్థినికి ఫొటోలు పంపేవాడు. తన ఫొటోలకు రిప్లే ఇవ్వాలని.. లేదంటే ఫెయిల్ చేస్తానని బెదించేవాడు. దీంతో ఆ విద్యార్థిని ఆందోళనకు గురవుతుండగా కుటుంబ సభ్యులు గుర్తించి ఏం జరిగిందని ఆరా తీయడంతో సంజయ్ బాగోతం బయటపడింది. దీంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు ఇదే విషయమై బుధవారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడు సంజయ్‌ని నిలదీయగా.. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థిని కుటుంబ సభ్యులు సంజయ్‌కి దేహశుద్ధి చేశారు. స్కూల్ యాజమాన్యంపై విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కు, ఎస్‌ఐ నాగరాజు పాఠశాలకు వచ్చి టీచర్ సంజయ్‌ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు సరెండర్ చేశారు. కాగా సంజయ్‌పై గతంలోనూ ఇదేవిధంగా పలువురిని ఇబ్బందులు పెట్టినట్లు తెలుస్తోంది. నిందుతుడిని కఠినంగా శిక్షించాలని ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్, డీఈఓ, పోలీసులకు ఫిర్యాదులు, వినతి పత్రాలు సమర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [H-42904]

Wanted

■మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167578]

■నల్గొండ జిల్లాలో గల గ్రామీణ ప్రాంతాల వారికి మా కంపెనీలో 29 స్త్రీ/పులకు ఉద్యోగాలు. జీ.14వేలు+బోనస్6వేలు+భోజనం, Q:10th-డిగ్రీ(P/F). సింధూ ప్రమోషన్స్, బోయవాడ. 8519891505. [L-822287]

■మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 80193 41329. [M-1167581]

■హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ. 18 K. ఫోన్: 9640258899 / 9640468899. [H-793668]

■షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్ భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12597]

■విజయవాడ ప్రముఖ హెల్త్‌కేర్ సర్వీసెస్ ఆఫీస్ వారికి వృద్ధులను, బెడ్ పేషెంట్లను వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు ఆయాలు, నర్సులు, వార్డ్‌బాయ్స్, కాంపౌండర్స్ కావలెను. జీతం 15-25K భోజనం + వసతి. కాల్/వాట్సాప్ 98850 25559, 91608 35559 [B-584]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని వివేకంగా పరిశీలించి విన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.